రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న జేసీ అదితీసింగ్



ఫిర్యాదులన్నీ పరిష్కరిస్తాం

● జాయింట్ కలెక్టర్ అదితి సింగ్

సీకేదిన్నె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చిన ఫిర్యాదులన్నీ పరిష్కరిస్తామని జాయింట్ కలెక్టర్ అదితీసింగ్ తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం టి.రామచంద్రాపురం గ్రామ రెవెన్యూ సదస్సులో శుక్రవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ వివాదాలను పరిష్కరించాలనే లక్ష్యంతో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది శ్రద్ధ వహించి అర్జీలు స్వీకరించారన్నారు. వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి వాటికి పరిష్కారాలు చూపుతామన్నారు. గ్రామ సభలో మొత్తం నాలుగు అర్జీలు స్వీకరించామని, అందులో రెండు మ్యుటేషన్‌కు సంబంధించినవి, ఒకటి సర్వేనంబరు మార్పు, మరొకటి భూ వివాదానికి సంబంధించిన అర్జీ వచ్చినట్లు తెలిపారు. వీటన్నింటిని ఆన్‌లైన్ ద్వారా వెబ్‌సైట్‌లో నమోదు చేసి, పూర్తిస్థాయి పరిశీలన చేసి త్వరితగతిన పరిష్కారం చూపుతామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఇది ఒక చక్కటి వేదిక అని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకొని సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్‌ఎర్విన్ తహసీల్దారు నాగేశ్వరరావు, ఆర్ఐ ఆదిరాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్ భాస్కర్‌రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు

పులివెందులటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కడప వైసీపీ ఎంపీ అవినాశ్‌రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. వివరాలిలా.. భాస్కర్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టు కొద్ది నెలల కిందట బెయిలు మంజూరు చేసింది. ఈ నిర్ణయాన్ని తొలుత సుప్రీంకోర్టులో సీబీఐ సవాల్ చేసింది. ఆ తరువాత భాస్కర్‌రెడ్డి బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ వివేకా కుమార్తె సునీత కూడా సుప్రీంకోర్టులో మరో పిటీషన్ దాఖలు చేశారు. ఈ పిటీషన్‌పై సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ సంజీవ్‌ఖన్నా నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపి, ప్రతివాదులు భాస్కర్‌రెడ్డి, సీబీఐలకు నోటీసులు జారీ చేసింది. గతంలో సీబీఐ దాఖలు చేసిన భాస్కర్‌రెడ్డి బెయిలు రద్దు పిటీషన్‌ను సునీత పిటీషన్‌తో జత చేస్తూ నోటీసులు ఇచ్చింది. తదుపరి విచారణను మార్చి మొదటి వారానికి వాయిదా వేసింది.

హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

కడప రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప నగరానికి చెందిన షేక్ ఖాదర్‌వల్లిని క్రూరంగా హత్యచేసిన కేసులో నిందితుడు షేక్ షాలుకు జీవిత ఖైదుతో పాటు రూ.2 వేలు జరిమానా విధిస్తూ జిల్లా సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి గల్లా శ్రీదేవి శుక్రవారం తీర్పును వెలువరించారు. వన్‌టౌన్ సీఐ రామకృష్ణ వివరాల మేరకు.. కడప నగరం రాయల్ వీధికి చెందిన షేక్ ఖాదర్‌వల్లి, షేక్ షాలులు ఇద్దరు జేబుదొంగలు. ఇరువురి మధ్య పరస్పర విభేదాలు ఉండేవి. ఈ నేపథ్యంలో 2020 మే 30న ఇరువురు కత్తులతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో షేక్ ఖాదర్‌వల్లి సులభ్ కాంప్లెక్స్ వద్ద కిందపడిపోవడంతో షేక్ షాలు అతని గొంతుకోసి తీవ్రంగా గాయపరిచాడు. ఈ మేరకు ఖాదర్‌వల్లి తిరుపతిలోని ఎస్వీఆర్ఆర్ ఆసుపత్రిలో 10 రోజులు చికిత్స అనంతరం మృతిచెందాడు. వన్‌టౌన్ పోలీసులు మొదట ఐపీసీ 324, 307 కింద కేసు నమోదు చేయగా తరువాత ఐపీసీ 302గా మార్చారు. నిందితుడు షేక్ షాలును పోలీసులు అరెస్టుచేసి కోర్టుకు హాజరుపెట్టగా రిమాండ్‌కు తరలించారు. అప్పటి వన్‌టౌన్ సీఐ సత్యనారాయణ విచారణ చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలుచేశారు. కాగా సెషన్స్ కోర్టు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి కేసు పూర్వాపరాలు విచారించి నిందితుడు షేక్ షాలును సీఆర్‌పీసీ 235(2) కింద దోషిగా నిర్ధారించి ఎస్‌సీ నెంబరు 249/2023 ప్రకారం జీవిత కారాగార శిక్షతో పాటు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పును వెలువరించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 3 నెలలు శిక్షను అనుభవించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.





మహర్దశ

● రూ.206 కోట్లతో కడప ఎయిర్‌పోర్టు విస్తరణ
● 16 వేల చదరపు అడుగులలో టెర్మినల్ భవనాలు
● 375 కార్ల పార్కింగ్‌కు ఏర్పాట్లు
● నేడు అంతర్జాతీయ పౌర విమానయాన దినోత్సవం

(కడప-ఆంధ్రజ్యోతి): కడప ఎయిర్‌పోర్టు దినదినాభివృద్ధి చెందుతోంది. 71 సంవత్సరాల క్రితం కడప నగరానికి 12 కి.మీ దూరంలో ఎయిర్‌పోర్టు నిర్మించారు. తొలినాళ్లలో ఇక్కడ వాయుదూత్ విమానాలను కడప-హైదరాబాదు మధ్య నడిపారు. నిన్నటి వరకు 72 సీట్ల కెపాసిటీ ఉండే ఏటీఆర్ విమానాలు మాత్రమే తిరిగేవి. అయితే ఇప్పుడు కడప ఎయిర్‌పోర్టు నుంచి ఎయిర్‌బస్‌లు తిరిగే స్థాయికి వచ్చేసింది. నైట్ ల్యాండింగ్ సౌకర్యం ఉంది. ఇంతింతై వటుడింతై అన్నట్లుగా కడప ఎయిర్‌పోర్టు దినదినాభివృద్ధి చెందుతోంది. ఇప్పుడు రాష్ట్రంలోని ప్రధాన ఎయిర్‌పోర్టులకు దీటుగా ముస్తాబవుతోంది. రూ.206 కోట్ల వ్యయంతో ఎయిర్‌పోర్టు రూపురేఖలే మార్చబోతున్నారు. రెండేళ్లలో కడప ఎయిర్‌పోర్టు స్వరూపమే మారిపోనుంది. నేడు అంతర్జాతీయ పౌరవిమాన దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

కడప ఎయిర్‌పోర్టును 1953 సంవత్సరంలో నిర్మించారు. అప్పట్లో రన్‌వే 3500 అడుగులు మాత్రమే ఉండేది. 1980లో కడప-హైదరాబాదు మధ్య వాయుదూత్ సర్వీసులు అప్పట్లో నడిపినా అనంతరం ఆగిపోయాయి. 2007లో ఎయిర్‌పోర్ట్ ఆఫ్ అథారిటీ ఇండియా కడప ఎయిర్‌పోర్టు అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. కాంపౌండ్‌వాల్, ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోలు భవనం, ప్యాసింజరు టెర్మినల్ భవనం, ఇతరత్రా పనులు చేపట్టారు. ఆధునీకరించిన విమానాశ్రయాన్ని 2015 జూన్7న అప్పటి మంత్రులు అభివృద్ధి చేశారు. 2015 జూన్ 7న కడప నుంచి బెంగుళూరుకు ఎయిర్‌పెగాస్ ఏటీఆర్ 72 సర్వీసులను అప్పటి కేంద్ర విమానయానశాఖ మంత్రి అశోక్‌గజపతిరాజు ప్రారంభించారు. వారానికి మూడురోజులు కడప-బెంగుళూరు మధ్య రాకపోకలు ఉండేవి. అయితే ప్రస్తుతం ఇవి రద్దయ్యాయి. మోదీ సర్కారు దేశంలోని ప్రధాన పట్టణాల మధ్య ప్రాంతీయ కనెక్టివిటీని పెంచేందుకు ఉడాన్ పథకం ప్రవేశపెట్టింది. దేశ వ్యాప్తంగా ఎయిర్‌పోర్టుల్లో అమలు చేయగా అందులో కడపకు ఒకటి వచ్చింది. కడప- హైదరాబాదు-కడప నుంచి తిప్పేందుకు విమాన సర్వీసులు ట్రూజెట్ ముందుకువచ్చింది. ఇందులో భాగంగా కడప - హైదరాబాదు, చెన్నై, విజయవాడకు సర్వీసులు తిప్పింది. టికెట్ ధరలు కూడా అందుబాటులో ఉండడంతో జనం ఫ్లైట్ జర్నీకి బాగా అలవాటుపడ్డారు. అయితే కరోనా కారణంగా కొద్దిరోజులు విమాన సర్వీసులు నిలిచినా, తరువాత మళ్లీ ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం కడప-హైదరాబాదు, చెన్నై, విజయవాడల మధ్య ఇండిగో విమాన సర్వీసులు నడుపుతోంది.

రూ.206 కోట్లతో అభివృద్ధి

దేశవ్యాప్తంగా ఎయిర్‌పోర్టులను మోదీ సర్కారు అభివృద్ధి చేస్తోంది. ఇందులో భాగంగానే కడప ఎయిర్‌పోర్టుకు రూ.250 కోట్లతో అభివృద్ధి చేసేందుకు ఈ ఏడాది ప్రధానమంత్రి మోదీ మార్చి 10న వర్చువల్‌గా ప్రారంభించారు. పెరుగుతున్న ట్రాఫిక్‌ను దృష్టిలో పెట్టుకుని శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా ప్రస్తుతం ఉన్న టెర్మినల్ బిల్డింగును మూడింతలు 16455 చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించనున్నారు. 24 చెకింగ్ కౌంటర్లు, 2 కన్వేయరు బెల్టులు, 3 ఎక్స్‌రే స్కానింగ్ మిషన్లు, ఎస్కలేటర్లు, ఎలిమినేటర్లు, సీనియర్ సిటిజన్ కోసం ప్రత్యేక ట్రాక్‌లు, గ్రీనరీ, రెస్టారెంట్లు ఇలా ప్రధాన విమానాశ్రయాలను తలదన్నే విధంగా టెర్మినల్ భవనాలు నిర్మించనున్నారు. ప్రస్తుతం ఎయిర్‌పోర్టులో 30 కార్ల పార్కింగ్ కెపాసిటీ ఉంది. అయితే కొత్తగా 375 కార్లు పార్కింగ్ చేసుకునే విధంగా పార్కింగ్ కెపాసిటీ పెంచనున్నారు. అంతర్జాతీయ విమానశ్రయాలకు దీటుగా కడప ఎయిర్‌పోర్టు సౌకర్యాలు త్వరలో అందుబాటులో రానున్నాయి. ఇప్పటికే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. 2026 నాటికి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా చూస్తోంది. ఈ మేరకు పనులు శరవేగంగా జరుగుతున్నాయి.

పెద్ద విమానాలు

ఇప్పటి దాకా ఏటీఆర్ విమానాలు 72 సీటింగ్ కెపాసిటీవి మాత్రమే తిరిగేవి. అయితే ఇప్పుడు రన్‌వే సామర్థ్యం పెంచారు. నైట్ ల్యాండింగ్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. దీంతో రాత్రి సమయంలోనూ కడప నుంచి విమానాలు వెళ్లనున్నాయి. ఇక ఎయిర్‌బస్ 170 సిటింగ్ కెపాసిటీ ఉన్న పెద్ద విమానాలు తిరగవచ్చు. 2014-19 సమయంలో సీఎంగా ఉన్న చంద్రబాబు కడప నుంచి గల్ఫ్ కంట్రీస్‌కు నేరుగా విమానాలు తిప్పాలని అప్పట్లో భావించారు. అయితే ఇప్పుడు నైట్ ల్యాండింగ్ సౌకర్యం అందుబాటులోకి రావడం, రెండేళ్లలో ఎయిర్‌పోర్టు రూపురేఖలు మారుతుండడంతో ఇక నుంచి రాబోవు రోజుల్లో నేరుగా దేశంలోని ప్రధాన మెట్రో సిటీతో పాటు గల్ఫ్ ఇతర ప్రాంతాలకు విమానాలు తిరిగే అవకాశం రానుందని చెబుతున్నారు. మొత్తానికి కడప ఎయిర్‌పోర్టు దినదినాభివృద్ధి చెందుతూ వస్తోంది.



హోంగార్డుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

● హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవంలో అదనపు ఎస్పీ ప్రకాశ్‌బాబు



ఏఎస్పీ ప్రకాశ్‌బాబుకు గౌరవ వందనం చేస్తున్న హోంగార్డులు

కడప(క్రైం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్న హోంగార్డుల సేవలు అభినందనీయమని జిల్లా అదనపు ఎస్పీ (పరిపాలన) ప్రకాశ్‌బాబు అన్నారు. 62వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఇన్‌చార్జ్ ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు కడప పోలీసు పేరేడ్ మైదానంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అదనపు ఎస్పీ పాల్గొన్నారు. హోంగార్డుల పెరేడ్‌ను ఆయన పరిశీలించి గౌరవవందనాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలుత టెరిటోరియల్ ఆర్మీ అని పిలువబడుతూ ఆర్మీకి సహాయంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దేశ సైన్యానికి సహాయంగా ఉన్నట్లే దేశ అంతరంగిక భద్రతకు పోలీసులకు సాయంగా ఉండేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఎలాంటి పారితోషికం లేకుండానే మొదటిసారిగా ట్రాఫిక్ విభాగంలో వారి సేవలందించారని తెలిపారు. 1946లో హోంగార్డు వ్యవస్థ ఆవిర్భవించిందని, అప్పటి ప్రధాన మంత్రి మొరార్జీ దేశాయి చేత మహారాష్ట్రలో సివిల్ గార్డు పేరుతో 1963లో ప్రారంభించారన్నారు. సివిల్, ఏఆర్ పోలీసులతో సమానంగా పనిచేస్తున్న హోంగార్డు సేవలు అభినందనీయమన్నారు. జిల్లాలో హోంగార్డు 607 మంది జనరల్ డ్యూటీ, 95 మంది ఆన్‌పేమెంట్ డ్యూటీ నిర్వహిస్తున్నారని, పోలీసుశాఖతో పాటు ఫైర్, జైళ్లశాఖ, ఆర్టీవో, విజిలెన్స్ విభాగాల్లో పని చేస్తూ వారికి వెన్నుముకలా నిలుస్తున్నారని తెలిపారు. హోంగార్డులు విధులతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకొని కుటుంబ సభ్యులతో సంతోషంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ఏఆర్ అదనపు ఎస్పీ రమణయ్య మాట్లాడుతూ విధుల్లో అకింత భావంతో పనిచేస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నారన్నారు. హోంగార్డులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివిధ క్రీడల్లో పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం పెరేడ్ మైదానం నుంచి హోంగార్డుల ర్యాలీని ఏఎస్పీ ప్రారంభించారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి ఏడురోడ్లు, పాత రిమ్స్ మీదుగా ఈ ర్యాలీ సాగింది.



ర్యాలీగా వెళ్తున్న హోంగార్డులు

కడపకు తలమానికం
శుభమస్తు షాపింగ్‌మాల్

● షాపింగ్‌మాల్‌ను ప్రారంభించిన సినీ నటి మీనాక్షి చౌదరి



కడపలో శుభమస్తు షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న సినీ నటి మీనాక్షి చౌదరి.. షాపింగ్‌మాల్ యజమానులు శ్రీనివాసులు, రవి తదితరులు

కడప కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చీరలంటే తనకు చాలా ఇష్టమని ప్రముఖ తెలుగు సినీ నటి లక్కీభాస్కర్ సినీ హీరోయిన్ మీనాక్షి చౌదరి అన్నారు. కడప నగరంలోని ఎర్రముక్కపల్లె సమీపంలోని మానస ఇన్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన శుభమస్తు షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి మీనాక్షి చౌదరి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మీనాక్షి చౌదరిని చూడడానికి పెద్ద ఎత్తున అభిమానులు షాపింగ్‌మాల్ పరిసర ప్రాంతాలకు తరలి వచ్చారు. అభిమానుల హర్షధ్వానాల మధ్య షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవ పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాల్ యజమానులు శ్రీనివాసులు, బి.రవితో పాటు కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి హీరోయిన్‌కు బొకే అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హీరోయిన్ మాట్లాడుతూ కడపకు తలమానికంగా శుభమస్తు షాపింగ్‌మాల్ నిలుస్తుందన్నారు. షాపింగ్ మాల్ యజమానులు బి.శ్రీనివాసులు, బి.రవి మాట్లాడుతూ షాపింగ్‌మాల్ ఏర్పాటుతో స్థానికులకు సుమారు 320 మందికి ఉపాధి కల్పించామని తెలిపారు. ప్రజల ఆదరాభిమానాలతో కడపలో ప్రారంభించిన ఏడో షాపింగ్‌మాల్ అని తెలిపారు. ఇక్కడ రూ.99 నుంచి సుమారు రెండు లక్షల వరకు చీరలు అందుబాటులో ఉన్నాయన్నారు. కావున సామాన్య ప్రజలు మొదలు ఉన్నత వర్గాలకు చెందిన వారికి అనువైన ధరల్లో చీరలు, ఇతర అన్ని రకాల దుస్తులు లభిస్తాయన్నారు. హీరోయిన్ మీనాక్షి చౌదరితో పాటు జబర్దస్త్ కళాకారులు బుల్లెట్ భాస్కర్, ఫైమా, రమేశ్ తదితరులు హాజరై సందడి చేశారు. కార్యక్రమంలో వేలాది మంది అభిమానులతో పాటు నగర ప్రముఖులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతిపై సీఎంవో ఆరా

● విద్యార్థులు కొట్టడంతోనే మృతి? ● పోలీసుల అదుపులో నిందితులు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణం కొత్తపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న సైన్సు టీచర్ ఎజాజ్ అహ్మద్ అనుమానాస్పద మృతి సంఘటనపై ముఖ్యమంత్రి కార్యాలయం ఆరా తీసినట్లు సమాచారం. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ సంఘటనను తీవ్రంగా పరిగణించినట్లు తెలుస్తోంది. ఈ సంఘటనపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని పూర్తి స్థాయిలో వివరాలు అడిగినట్లు తెలుస్తోంది. ఈ సంఘటనలో జిల్లా విద్యాశాఖాధికారులు ఇద్దరు ఉపాధ్యాయులను శుక్రవారం సాయంత్రం సస్పెండు చేసినట్లు సమాచారం. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షబ్బీర్, ఇంగ్లీష్ టీచర్ వెంకట్రామిరెడ్డిలు సస్పెండు అయిన వారిలో ఉన్నట్లు తెలిసింది. పోలీసు, విద్యాశాఖాధికారుల విచారణలో మృతుడు ఎజాజ్‌ను విద్యార్థులు కొట్టినట్లు తేలినట్లు సమాచారం. సంఘటన జరిగిన రోజు మధ్యాహ్నం 3.30 గంటల విరామ సమయంలో నిందితుల్లో చిన్నవాడైన విద్యార్థితో అల్లరి చేసి మిగిలిన విద్యార్థులను ఇబ్బందిపెట్టవద్దని ఉపాధ్యాయుడు ఎజాజ్ హెచ్చరిస్తూ కొట్టినట్లు తెలిసింది. అదే సమయంలో అక్కడే ఉన్న నిందితుల్లో పెద్దవాడైన విద్యార్థి ఉపాధ్యాయుడిపైన దాడి చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడికి కంటి వద్ద గాయమైంది. తర్వాత పాఠశాలలోని ఉపాధ్యాయులు జోక్యం చేసుకుని పిల్లల తల్లిని పిలిపించి మందలించారు. ఉపాధ్యాయుడికి క్షమాపణ చెప్పించారు. పిల్లల క్షమాపణ తనకు వద్దన్న ఉపాధ్యాయుడు, అక్కడి నుంచి పక్కకు వెళ్లిపోయాడు. తర్వాత సుమారు 40 నిమిషాల తర్వాత ఉన్నఫళంగా ఆ ఉపాధ్యాయుడు కింద పడిపోయాడు. విద్యార్థి తనపై దాడి చేయడాన్ని జీర్ణించుకోలేక మనోవేదనకు గురై ఉపాధ్యాయుడు మృతి చెందినట్లు తెలిసింది. అయితే ఈ విషయాలను ప్రధానోపాధ్యాయుడు, ఇంగ్లీషు టీచర్ ఉన్నతాధికారులకు తెలియజేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలున్నాయి. విచారించిన ఉన్నతాధికారులు ఇద్దరినీ సస్పెండ్ చేసినట్లు తెలిసింది. నిందితులిద్దరూ 14, 15 సంవత్సరాల బాలలు కావడంతో జువైనల్ హోంకు తరలించనున్నట్లు తెలిసింది.

పెద్దదర్గాకు సినీనటి అంజలి



కడప కల్చరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత అమీన్‌పీర్ (పెద్దదర్గా)ను తెలుగు సినీ నటి అంజలి శుక్రవారం సందర్శించారు. తొలుత దర్గా చేరుకున్న ఆమెకు దర్గా ప్రతినిధులు స్వాగతం పలికారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ మొట్టమొదటిసారి పెద్దదర్గాకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. త్వరలో విడుదల కానున్న గేమ్‌చేంజర్ సినిమాలో తాను నటించానని, ప్రేక్షకులు ఆదరించాలని కోరారు.

సర్వం సిద్ధం

● నేడే మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్
● హాజరుకానున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్



సభాప్రాంగణంలో పనులు పర్యవేక్షిస్తున్న జేసీ అదితి సింగ్

కడప ఎర్రముక్కపల్లె, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎడ్యుకేట్ ఎంగేజ్ ఎన్‌పవర్ లక్ష్యాలతో దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం నిర్వహించనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశానికి పాఠశాల విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సమావేశాలను జిల్లాలో అన్ని పాఠశాలల్లో పండుగ వాతావరణంలో నిర్వహించనున్నారు. విద్యావ్యవస్థను రాజకీయాలకు దూరంగా ఉంచడం విద్య నేర్చుకునే పిల్లలు వారి తల్లిదండ్రులను పాఠశాలలకు దగ్గర చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ సమావేశాలను నిర్వహిస్తోంది. కడప నగరం మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో శనివారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ హాజరుకానున్నారు. పాఠశాలల్లో తల్లిదండ్రులకు, సమాజానికి మధ్య పటిష్టమైన సుసంపన్నమైన బంధాన్ని ఏర్పరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. శనివారం జిల్లాలోని ప్రతి పాఠశాలలో రాజకీయాలకతీతంగా ఈ కార్యక్రమం నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. కేవలం పిల్లల విద్యాప్రగతి, తీసుకోవాల్సిన చర్యలపై మాత్రమే చర్చ జరగాలని ఆదేశించింది.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

విద్యార్థులకు విద్యకు సంబంధించిన విషయాలతో పాటు ఆరోగ్య పరిస్థితులపై చర్చిస్తారు. అందుకు ఆరోగ్య కార్డులను సిద్ధం చేశారు. అందులో విద్యార్థి ఆరోగ్యానికి సంబంధించిన సమాచారం ఉంటుంది. దీంతో పాటు అకడమిక్ అంశాలు తెలిపే సమగ్ర ప్రగతి పత్రం అందిస్తారు. గత ప్రభుత్వ హయాంలో ఏ కార్డు ఇచ్చినా జగన్ చిత్రపటాలు ఉండేవి. కూటమి ప్రభుత్వం ప్రగతి పత్రంలో కేవలం రాజముద్ర మాత్రమే ఉండేలా నిర్ణయం తీసుకుంది.

షెడ్యూలు ఇలా..

ఉదయం 9.30 గంటలకు సమావేశం ప్రారంభం. 10 నుంచి 11.30 వరకు ఉపాధ్యాయులతో విద్యార్థుల హాజరు, క్రమశిక్షణ, విద్యాప్రగతి, ఇతర అంశాలపై చర్చ. 11.30-11.50 వరకు తల్లిదండ్రులకు రంగోలి, తాడులాగే పోటీలు, 11.50- 12.15 వరకు సాధారణ సమావేశం, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, 12.15- 12.45 వరకు అతిథుల ప్రసంగాలు, ప్రగతి నివేదికలు అందజేత. 12.45 నుంచి 12.50 వరకు సలహాలు, సూచనలు. 12.50 నుంచి ఒంటిగంట వరకు ప్రతిజ్ఞ, ముగింపు. ఒంటిగంటకు భోజన కార్యక్రమం.

నిధులు ఇలా..

జిల్లాలో 2043 పాఠశాలలకు సంబంధించి మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఆయా పాఠశాలల్లో లక్షా 39వేల 669 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. అలాగే ఈ కార్యక్రమానికి వారి తల్లిదండ్రులు కూడా హాజరుకానున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ప్రభుత్వం 2043 పాఠశాలలకు గానూ రూ.38,19,200ల నిధులను విడుదల చేసింది.

హాజరుకానున్న ఉప ముఖ్యమంత్రి



కడప నగరం మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో జరగనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌కు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ హాజరు కానున్నారు. ఉదయం 10.45 గంటలకు మున్సిపల్ హైస్కూలు మెయిన్‌కు ఉపముఖ్యమంత్రి చేరుకోనున్నారు. ఒంటిగంట వరకు సమావేశంలో ఉంటూ విద్యార్థులకు, అధికారులకు తల్లిదండ్రులకు పలు సూచనలు, సలహాలు తెలియజేయనున్నారు.

ఏర్పాట్లు వేగవంతం చేయాలి: జేసీ

ఉప ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జేసీ అదితి సింగ్ సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం మున్సిపల్ హైస్కూలు మెయిన్‌లో మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌లో భాగంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి హాజరుకానున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టి అమలు చేస్తున్న మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి పాల్గొంటున్న సందర్భంగా ఏర్పాట్ల నిర్వహణపై అధికారులతో కలిసి పర్యవేక్షించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో జాన్‌ఎర్విన్, మున్సిపల్ కమిషనరు మనోజ్‌రెడ్డి, డీఈవో మీనాక్షి, జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేశ్, సంక్షేమశాఖాధికారి క్రిష్ణకిశోర్, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్‌నాయక్, డీఎంహెచ్‌వో నాగరాజు, సమాచారశాఖ ఏడీ వేణుగోపాల్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

ఉద్యాన సమగ్ర పథకానికి
రూ.18.13 కోట్లు మంజూరు

కడప ఎన్టీఆర్‌సర్కిల్/రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు ఉద్యాన సమగ్ర పథకం కింద రూ.18.13 కోట్లు జిల్లాకు మంజూరు అయినట్లు జిల్లా ఉద్యాన అధికారి ఎస్.సుభాషిణి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నిధులతో ఇంటిగ్రేటెడ్ ప్యాక్ హౌస్, శీతల గిడ్డంగులు,శీతల గదులు, రెపనింగ్ చాంబరు, ఉల్లి నిల్వ గోదాలు కలెక్షన్ సెంటరులు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారానికి మండలాల్లోని ఉద్యాన అధికారులను సంప్రదించాలని సూచించారు. అదే విధంగా కలెక్టరేట్‌లోని ఓ బ్లాక్‌లో ఉన్న తమ కార్యాలయంలో కూడా సంప్రదించవచ్చని తెలిపారు.

టీడీపీ నేత ఇందిరెడ్డి తిమ్మారెడ్డి మృతి


తిమ్మారెడ్డి (ఫైల్)

వల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తప్పెట్ల కొత్తపల్లె గ్రామానికి చెందిన టీడీపీనేత ఇందిరెడ్డి తిమ్మారెడ్డి అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. ఆయన గత ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. ఈయన మృతి విషయం తెలిసిన కమలాపురం టీడీపీ ఇన్‌చార్జ్ ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి, పుత్తా లక్ష్మీరెడ్డితో పాటు కడప మేయరు సురేశ్‌బాబు, అభిమానులు తిమ్మారెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈయన మృతి పార్టీకి తీరని లోటు అని వారు పేర్కొన్నారు.

దివ్యాంగులకు ఇంటిస్థలాలు: ఎమ్మెల్యే

కడప మారుతీనగర్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): మరో ఆరునెలల వ్యవధిలో దివ్యాంగులకు కడప లో ఇంటిస్థలాలు మంజూరు చేస్తామని కడప ఎమ్మెల్యే మాధవి అన్నారు. ప్రపంచ వికలాంగుల దినోత్సవం సందర్భంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమం నిర్వహించారు. కడప ఎమ్మెల్యే మాధవీతో పాటు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి హాజరై మాట్లాడారు. వికలాంగులకు ప్రత్యేక కాలనీ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రతి సోమవారం తమ నివాసం ఎదుట ప్రత్యేక గ్రీవెన్స్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగులకు దుప్పట్లు, వీల్ చైర్లు, ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నసుబ్బయ్య, జిల్లా అధ్యక్షుడు మాతయ్య, సమితి నాయకులు ఆంజనేయులు, దివ్యాంగులు హాజరయ్యారు.

పోలీసుల అదుపులో పాల వ్యాపారి ?

కడప(క్రైం), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పాతకడపకు చెందిన పాల వ్యాపారిని రిమ్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. రామాంజనేయపురానికి చెందిన మహిళ, అలాగే కాగితాలపెంట ప్రాంతానికి చెందిన మరో మహిళల కుటుంబాలకు పాలు పోస్తుంటాడు. అయితే ఒక మహిళకు తెలియకుండా మరో మహిళకు వారి ఫోటోలు వాట్సాప్ ద్వారా పంపిచాడు. రామాంజనేయపురానికి చెందిన మహిళ ఫోటోలు తీస్తుండగా ఆమె తన ఫోటోలు ఎందుకు తీశావంటూ పాల వ్యాపారిని నిలదీసింది. ఆమె సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ పాల వ్యాపారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

భక్తిశ్రద్ధలతో విగ్రహ ప్రతిష్ఠ

పెండ్లిమర్రి, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): గోపరాజుపల్లెలో నిర్మించిన సీతారామ లక్ష్మణ అంజనేయస్వామి సమేత విగ్రహ ప్రతిష్ఠను శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పాల్గొని పూజలు చేశారు.

భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్: ఎమ్మెల్యే




కడప: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ బృందం... వేంపల్లెలో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న రామమునిరెడ్డి తదితరులు... పులివెందుల జేఎన్టీయూ కళాశాలలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్

కడప(వినాయకనగర్), డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత, దళిత, బడుగు, బలహీన వర్గాల వికాసానికి పాటుపడిన మహానేత అంబేడ్కర్ అని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రెడ్డెప్పగారి మాధవీరెడ్డి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డి అన్నారు. గురువారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా కలెక్టరేట్ ఆవరణంలోని బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కడప నగర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మద్దూది రాయుడు, శివానందపురం ఇన్‌చార్జి తదితరులు పాల్గొన్నారు.

దళితమిత్ర సంఘం ఆధ్వర్యంలో...

అంబేడ్కర్ విగ్రహానికి దళితమిత్ర సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు కైపు రామాంజనేయులు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మనోహర్, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ రూపకర్తకు ఘన నివాళి

కడప సెవెన్‌రోడ్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) :రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ వర్ధంతినిశుక్రవారం కడప నగరంలోని ఆర్టీసీ బస్టాండు సర్కిల్ వద్ద ఆయన విగ్రహానికి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎన్‌డీ విజయజ్యోతి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కడప అసెంబ్లీ కో ఆర్డినేటరు బండి జకరయ్య, సిటీ అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆలీఖాన్, ఏఐసీసీ కో ఆర్డినేటరు అబ్దుల్ సత్తార్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు మామిళ్లబాబు, మల్లెం విజయభాస్కర్, సయ్యద్‌సలావుద్దీన్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత

వేంపల్లె, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ పరిరక్షణ ప్రతి భారతీయుని కర్తవ్యమని రాజ్యసభ మాజీ సభ్యుడు, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లెలో స్వర్గీయ అంబేడ్కర్ 68వ వర్ధంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. తులసిరెడ్డి మాట్లాడుతూ స్వయం కృషి, స్వీయ ప్రతిభకు అంబేడ్కర్ నిలువెత్తు నిదర్శనమన్నారు. కుల వ్యవస్థ నిర్మూలన కోసం జీవితాంతం కృషిచేశారన్నారు. ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, సామ్యవాదం, గణతంత్ర రాజ్యం అనే నాలుగు స్తంభాల మీద స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, సౌభ్రాతృత్వం అనే నాలుగు దూలాల మీద భారత రాజ్యాంగసౌదాన్ని అంబేడ్కర్ నిర్మించారన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్తన్న, నాగరాజు, ఐచర్ రమణ, వినయ్, వెంకటేష్, మాస్, బాలం సుబ్బరాయుడు, ఆరుసేర్ల సుబ్బరాయుడు అన్నారు.

టీడీపీ ఆధ్వర్యంలో...

భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు టీడీపీ నాయకులు ఘన నివాళులర్పించారు. స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్దనున్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. భారత రాజ్యంగ నిర్మాతగా ఆయన తరతరాలకు గుర్తిండిపోయే సేవలను దేశానికి అందించారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామమునిరెడ్డి, సీనియర్ నాయకులు బాలస్వామిరెడ్డి, జగన్నాథరెడ్డి, ఎల్‌బీఆర్, నామా వేమకుమార్, డక్కా రమేష్, మహమ్మద్, ఇనయతుల్లా, పూల బక్షు,రామచంద్ర, బాల వెంకటరెడ్డి, ఈశ్వరయ్య, ఎక్స్ ఆర్మీ శివ తదితరులు ఉన్నారు.

పులివెందులలో...

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని జేఎన్టీయూ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శేషమహేశ్వరమ్మ అన్నా రు. స్థానిక జేఎన్టీయూ కళాశాలలో శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అ ర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ మురళి, డాక్టర్ సాంబయ్య, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భరతజాతి ముద్దుబిడ్డ అంబేడ్కర్

కడప మారుతీనగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భరతజాతి ముద్దుబిడ్డ అంబేడ్కర్ అని జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక పార్టీ జాతీయ అధ్యక్షుడు అవ్వారు మల్లిఖార్జున అన్నారు. అంబేడ్కర్ జయంతి సందర్భంగా శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమీపంలో పార్టీ కార్యాలయంలో వర్ధంతి వేడుకలు నిర్వహించారు. నాయకులు పీవీ రమణ, పెంచలయ్య, భాస్కర్ పాల్గొన్నారు.

అత్యంత విద్యావంతుడు అంబేడ్కర్

అత్యంత విద్యావంతుడు, భారతరత్న బిరుదాంకితుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరు బాలదాసు కొనియాడారు. ఎర్రముక్కపల్లెలో గల ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

వేంపల్లె: ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో ఎస్సీ, ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను గురించి డైరెక్టర్ కుమారస్వామి గుప్త వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఓ రవికుమార్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




కడప: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం... అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి, శ్రీనివాసరెడ్డి... ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న డైరెక్టర్ కుమారస్వామి గుప్త తదితరులు

దేశానికి వెలుగునిచ్చిన దార్శనికుడు బీఆర్ అంబేడ్కర్


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, సురేశ్‌బాబు

కడప ఎర్రముక్కపల్లె డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : చీకటిలో దీపంలా దేశ ప్రజలందరికీ రాజ్యాంగం ద్వారా వెలుగునిచ్చిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గొప్ప దార్శనికుడని వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి తెలిపారు. వైవీయూలో శుక్రవారం అంబేడ్కర్ 68వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాలులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసరు వినోదిని, ప్రిన్సిపల్ రఘునాధరెడ్డి, రిజిస్ట్రారు పద్మ, ప్రొఫెసరు రంగయ్య, ఏజీ దాము తదితరులు పాల్గొన్నారు.

ఏఎఫ్ఏయూలో...

అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రిజిస్ట్రారు రాజేశ్ కుమారరెడ్డి, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

మాజీ ఉప ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో...

ఆర్టీసీ బస్టాండు అంబేడ్కర్ సర్కిల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి మాజీ ఉప ముఖ్యమంత్రి అంజ ద్‌బాషా ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.


అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న వైస్‌చాన్సలర్ తదితరులు

ఉపాధ్యాయుడి మృతి బాధాకరం: మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : రాయచోటి ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు అహ్మద్ మృతి బాధాకరమని, రాష్ట్ర రవాణా, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మృతుడి నివాసంలో ఆయన కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. అహ్మద్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉందన్నారు.

మంత్రి లోకేశ్ ఫోను ద్వారా పరామర్శ

విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఫోను చేసి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించిచారు.అధైర్యపడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.

ఎస్టీయూ వినతి:అహ్మద్ కుటుంబానికి న్యాయం చే యాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్ బాషా రాష్ట్ర నాయకులు బాలగంగారెడ్డి కోరారు. శుక్రవారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందించారు.


మంత్రి నారా లోకేశ్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న అహ్మద్ కుటుంబ సభ్యులు

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటాం: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి

కమలాపురం రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):కార్యకర్తలే మా బలం అని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటామని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయ ఆవరణంలో నియోజకవర్గ స్థాయి టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి పార్టీ నేతలు విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి, ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి పాల్గొన్నారు. ముందుగా టీడీపీ సీనియర్ నాయకుడు తిమ్మారెడ్డి మృతికి సంతాపం తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి టీడీపీ కార్యకర్త కల 20 సంవత్సరాల తరువాత నెరవేరిందన్నారు.కొప్పర్తి పారిశ్రామికవాడలో రూ.120 కోట్లతో నూతన పరిశ్రమ ఏర్పాటు అవుతుందని, అందులో ప్రతి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ ఎన్నికల మాదిరే పంచాయతీ ఎన్నికల్లో కూడా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసి అత్యధిక మెజార్టీతో అన్ని పంచాయతీలు గెలిపించాల్సారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పు త్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ గత ఎన్నికల్లో నియోజకవర్గంలో 251 పోలింగ్‌బూత్‌లు ఉంటే 230 పోలింగ్ బూత్‌లలో మెజార్టీ వచ్చిందని 98 పంచాయతీలు ఉంటే 92 పంచాయతీల్లో అత్యధిక మెజార్టీ వచ్చిందని ఇదంతా కార్యకర్తలు కష్టఫలమే అన్నారు. కార్యక్రమంలో ఖాదర్‌బాషా, వాసుదేవరెడ్డి, దివాకర్‌రెడ్డి, జంపాల నరసింహారెడ్డి, ఆరు మండలాల కన్వీనర్లు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాంప్రసాద్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గ అధ్యక్షులు చంద్రమోహన్‌రెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అ ధ్యక్షుడు మల్లేష్, స్థానిక టీడీపీ నాయకులు రెడ్డికరీం, మస్తానయ్యరాజారెడ్డి, టీడీపీ జనసేన బీజేపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో హైనా కలకలం

లింగాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): లింగాలలో శుక్రవారం ఉదయం హైనా కలకలం రేగింది. గ్రామానికి చెందిన బయన్న ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఉదయం ఇంటి నుంచి బయటకు రాగానే ఎదురుగా ఉన్న హైనా పరుగులు తీసింది. పులిపిల్లగా భావించి అందరికి పులిపిల్లను చూశానని తెలిపాడు. సమాచారం అందుకున్న ముద్దనూరు అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు సంఘటన స్థలంలోని పాదముద్రలు పరిశీలించి పులిపిల్ల కాదు హైనాగా గుర్తించారు. ఆయన మాట్లాడుతూ హైనా కుక్క జాతికి చెందినది మాంసాహార జంతువు అని తెలిపారు. మనుషులకు ఎలాంటి ప్రమాదం లేదన్నారు. చిన్న పిల్లల పట్ల కాస్త అప్రమత్తగా ఉండాలని సూచించారు. కర్ణపాపాయపల్లెలో కూడా గురువారం పొలంలో కనిపించిన జంతువు హైనాగా గుర్తించారు.


మాట్లాడుతున్న డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు

వ్యక్తిని బలవంతంగా తీసుకెళ్లిన వ్యాపారి

కడప(క్రైం), డిసెంబరు 6: కడప నగరం ఎన్జీవో కాలనీకి చెందిన ఓ వ్యక్తి వేంపల్లెకు చెందిన వ్యాపారి వద్ద లక్షల్లో అప్పు తీసుకున్నట్లు తెలిసింది. ఈ అప్పు చెల్లించకపోవడంతో శుక్రవారం ఆ వ్యాపారి కడపలోని అప్పు తీసుకున్న వ్యక్తి ఇంటికి రాత్రి వచ్చి కారులో బలవంతంగా తీసుకెళ్లినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా ఈ విషయంపై చిన్నచౌకు పోలీసులను వివరణ అడుగగా... ఈ విషయం తమ దృష్టికి రాలేదని, ఇప్పటి వరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

వైవీయూలో విభాగాల అధిపతులు, సమన్వయకర్తల నియామకం

కడప ఎర్రముక్కపల్లె డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : వైవీయూలో పలు విభాగాల అధిపతులు, సమన్వయకర్తలను నియమిస్తూ రిజిస్ట్రారు ప్రొఫెసరు పుత్తా పద్మ ఉత్తర్వులు జారీ చేశారు. 2026 డిసెంబరు 4 వరకు విధుల్లో కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో పనిచేసిన వారి పదవీ కాలం పూర్తి కావడంతో నూతన నియామకాలు చేపట్టామన్నారు. డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ (ఎర్త్‌సైన్స్) డాక్టర్ రామక్రిష్ణ బయోటెక్నాలజీ అండ్ బయోఇన్‌ఫర్‌మేటిక్, డాక్టర్ చంద్రశేకర్ పర్యావరణ శాస్త్రం, డాక్టర్ మునికుమారి జెనెటిక్ అండ్ జనోమిక్, డాక్టర్ ఎన్.సుభాష్‌చంద్ర మైక్రోబయాలజీ, డాక్టర్ లాజర్ మనస్తత్వ శాస్త్రం డాక్టర్ ప్రమీలా మార్గరేట్ పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ప్రొఫెసరు ఎంఎం వినోదిని తెలుగు, ప్రొఫెసరు శ్రీనివాసులు ఆర్థిక శాస్త్రం, డాక్టర్ ఎస్వీ వెంకటరమణ జంతు శాస్త్రం, డాక్టర్ సునీత భూగర్భ శాస్త్రం, డాక్టర్ సి.సరిత బిజినెస్‌మేనేజ్‌మెంటు, కె.మృత్యుంజయరావు ఫైన్ ఆర్ట్స్, డాక్టర్ టి.శ్యాంస్వరూప్ జర్నలిజం అండ్ కమ్యూనికేషన్, డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్‌గా నియమితులయ్యారు.

తొమ్మిది మంది జూదరులు అరెస్టు

లింగాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): లింగాల మండలంలోని వెలిదండ్ల గ్రామ పరిధిలో జూదమాడుతున్న తొమ్మిది మం దిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ మధుసూధన్‌రావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం అందిన సమాచారం మేరకు దాడులు చేసి రూ. 30410 నగదు స్వాధీనం చేసుకొని అరె స్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. నిబంధనలు మీరితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

బాలవికాస్ హైస్కూలుకు ఎడ్యు లీడర్ అవార్డు


అవార్డును అందుకుంటున్న డైరెక్టరు గంగయ్య

కడప ఎర్రముక్కపల్లె డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాదు హైటెక్ ఎగ్జిబిషన్ హాలులో జరిగిన 5వ ఐపీ సెట్ అవార్డు కార్యక్రమంలో కడప నగరం బాలవికాస్ హై స్కూలుకు ప్రతిష్ఠాత్మకమైన ఎడ్యులీడరు అవార్డును ప్రకటించారు. ఈ అవార్డును బాలవికాస్ పాఠశాల డైరెక్టరు గంగయ్య స్వీకరించారు. దక్షిణ భారతదేశంలో ప్రకటించిన 8 అవార్డుల్లో కడప నగరం బాలవికాస్ హై స్కూలు ఒకటిగా నిలవడం ఎంతో గర్వంగా ఉందని డైరెక్టరు గంగయ్య తెలిపారు. ఈ అవార్డును పాఠశాల ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఫలితాలు విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పారామీటర్స్‌ను పరిగణనలోకి తీసుకుని ఈ అవార్డు ప్రకటించినట్లు తెలిపారు. ఇంత ప్రతిష్ఠాత్మక అవార్డుకు ఎంపికలో విశేష కృషి చేసిన విద్యారత్న కరస్పాండెంట్ సిద్ధం సుబ్బరాయుడకు మాజీ కరస్పాండెంట్ కీశే లక్ష్మీదేవికి అంకితం చేస్తున్నట్లు స్పష్టం చేశారు.

సమస్యల పరిష్కారం కోసం ప్రజల వద్దకే: తహసీల్దార్



చెన్నూరు: సదస్సులో తహసీల్దారుకు సమస్యలు వివరిస్తున్న రైతు... ఎర్రగుడి గ్రామంలో మురుగు నీటిని పరిశీలిస్తున్న అధికారులు

చెన్నూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారం కోసం ప్రజల వద్దకే వెళ్లి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్న తహసీల్దార్ తహసీల్దారు సరస్వతి అన్నారు. శుక్రవారం కనుపర్తి గ్రామంలో 'మీ భూమి మీ హక్కు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 17 మంది రైతులు భూములకు సం బంధించిన సమస్యలు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. అందులో 13 మంది భూమి ఆన్‌లైన్ చేసి మ్యుటేషన్ చేయాలని, ఇద్దరు రైతులు పేర్లు మార్పు జరగాలని, మరో ఇద్దరు తమకు భూములు కావాలని దరఖాస్తులు సమర్పించారు. వాటిని పరిశీలించిన తహసీల్దారు మాట్లాడుతూ ప్రతి సమస్యను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. అలాగే అడంగల్ 1బీ రిజిస్టరు. 22ఏ లాంటివి పరిశీలిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సర్వేయరు సోమశేఖర్, డీటీ (సర్వే) అర్చన, మండల ప్రత్యేక అధికారి పరిమళ జ్యోతి, ఆర్ఐ కౌశిక్, వీఆర్వో వినోద్ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారమే ధ్యేయం

చక్రాయపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారమే ధ్యేయమని తహసీల్దార్ విజయకుమారి, స్పెషలాఫీసర్ హమ్మదుల్లా అలి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కె.ఎర్రగుడి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. గ్రామంలో 200 దరఖాస్తులు వచ్చాయన్నారు. అడంగల్ రాలేదని, పాసు బుక్కులు లేవని, ఆ భూములు వేరే వారి పేరుపై ఎక్కించారని, ఆన్‌లైన్‌లో ఎక్కడం లేదని సదస్సు దృష్టికి తీసుకొచ్చారు. ఎర్రగుడి గ్రామంలో పర్యటించి పారిశుధ్యం, తాగునీరు, శుభ్రతపై దృష్టిసారించారు. ఎర్రగుడిలో పారిశుధ్యం అధ్వాన్నంగా ఉందని, డ్రైనేజీ కాల్వలు ఏర్పాటుచేసి పారిశుధ్యం పాటించాలని సంబంధిత కార్యదర్శికి, సర్పచుకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శివారెడ్డి, వీఆర్వోలు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోండి

లింగాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ ఈశ్వరయ్య, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరెడ్డిలు పేర్కొన్నారు. మండలంలోని దొండ్లవాగు గ్రామంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఆన్‌లైన్‌లో భూమి నమోదు చేయాలని మూడు, 1బి కావాలని ఒకటి దరఖాస్తులు వచ్చాయన్నారు. డీటీ నరేంద్ర, సర్వేయర్ పార్వతిలు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

సింహాద్రిపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భూమి సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు మండల ప్రత్యేక అధికారి సన్నన్న పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని అగ్రహారం గ్రామంలో రెవిన్యూ సదస్సు తహసీల్దార్ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో డీటీ హరిబాబు, వీఆర్వోలు, సర్వేయర్లు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

వల్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసిందని తహసీల్దారు శ్రీవాణి తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని అంబవరం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 45 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా తమ భూమి సరిహద్దుల కోసం ఎక్కువగా దరఖాస్తులు చేసుకున్నట్లు ఆమె తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

తిప్పిరెడ్డిపల్లెలో రెవిన్యూ గ్రామసభ

పెండ్లిమర్రి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పిరెడ్డిపల్లెలో శుక్రవారం తహసీల్దార్ అనురాధ అధ్యక్షతన రెవిన్యూ గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో ఏమైన రెవిన్యూ సమస్యలు ఉంటే తెలపాలన్నారు. ఆ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రజల వద్దకే వెళ్లి సమస్యనుతెలుసుకొని పరిష్కరించడం కోసం ఈ గ్రామసభల ముఖ్య ఉద్దేశమన్నారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

కమలాపురం రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నగర పంచాయతీ పరిధిలోని కుప్పూరు వారిపల్లె వద్ద ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయంలో పట్టపగలే చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. గురువారం ఉదయం ఓ వైపు అయ్యప్ప శివమాలధారులకు వంట మనిషి, మరికొందరు భిక్ష వండే పనిలో నిమగ్నం కాగా అందులో భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకుని పూజలు చేసి వెళ్లిపోయారు. అర్చకుడు కూడా మరో దేవాలయంలో పూజలు చేసేందుకు వెళ్లారు. ఎవరి పనిలో వారు ఉండగా ఇది గమనించిన గుర్తు తెలియని దుండగులు ఆలయంలోకి ప్రవేశించి అక్కడ స్వామివారి వద్ద ఉన్న రెండు కిలోల బరువున్న వెండి పళ్లెం, రెండు పావుకోళ్లను అపహరించుకుని వెళ్లారు. వాటి విలువ రూ.2 లక్షలు ఉంటుందని ఆలయ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి శుక్రవారం తెలిపారు. ఒక దొంగ ఆలయంలోకి వెళ్లి వెండి వస్తువులను తీసుకుని గోడ అటు వైపు వేయడంతో మరో దొంగ వాటిని తీసుకెళ్లి తరువాత ఇద్దరూ ద్విచక్ర వాహనంపై వెళ్లినట్లు తెలిసిందన్నారు. ఆ మేరకు గురువారమే పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయడంతో వారు వచ్చి పరిశీలించి వెళ్లారని ఆయన తెలిపారు.

పనులను త్వరగా పూర్తి చేయండి

పెండ్లిమర్రి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ పనులను త్వరగా పరిష్కరించాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి సూచించారు. శుక్రవారం భవన సముదాయాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ భైరవగుట్టలో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన సముదాయాల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ప్రారంభోత్సవానికి జనవరిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హాజరవుతారన్నారు. ఈలోపు పనులను పూర్తిచేయాలన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఇరువురి మధ్య ఘర్షణ

● ఒకరి మృతి



మృతిచెందిన రామాంజనేయులు

చక్రాయపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండికొవ్వూరు గ్రామం దళితవాడలో శుక్రవారం సాయంత్రం మురుగు నీరు వస్తున్నాయని ఘర్షణకు దిగడంతో దండు రామాంజనేయులు (36) మృతిచెందాడు. దండు రామాంజనేయులు భార్య శివలక్ష్మి ఫిర్యాదు మేరకు చక్రాయపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకెళితే... బట్టలు ఉతికే నీళ్ల ఇంటి ముందు పోతున్నాయని నాగార్జున, రామాంజనేయులు గొడవకు దిగారు. దీంతో రామాంజనేయులు నాగార్జున చెల్లెలను కొట్టడంతో నాగార్జున కోపంతో రామాంజనేయులును కట్టెతో కొట్టడంతో మృతిచెందినట్లు తెలిపారు. నాగార్జున పరారీలో ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

వాటర్‌గండి వద్ద యువకుడు మృతి



యోహాను (ఫైల్)

చెన్నూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గండి వాటర్ వర్క్స్ వద్ద శుక్రవారం సాయంత్రం ఈత కోసం దిగిన కడప నగరానికి చెందిన దాట్ల యోహాను (20) అనే యువకుడు మృతి చెందాడు. కడప అశోక్ నగర్‌కు చెందిన కూలీ దాట్ల ప్రతాప్ కుమారుడు యోహాను ఐటీఐ పూర్తి చేశాడు. శుక్రవారం స్నేహితులతో కలిసి సరదాగా గండి వాటర్‌వర్క్స్ వద్దకు వెళ్లాడు. అక్కడ నీటిలో ఈత కొడుతుండగా నీటి ఉధృతికి మునిగి చనిపోయాడు. సీఐ పురుషోత్తంరాజు మాట్లాడుతూ హెచ్చరిక బోర్డులున్నా నిర్లక్ష్యంతో దిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు తగు జాగ్రత్తలు చెప్పాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

భూమి కలుషితం కాకుండా చూడటం మనందరి బాధ్యత

సింహాద్రిపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) భూమి కలుషితం కాకుండా చూడటం మనందరి బాధ్యత అని మండల వ్యవసాయాధికారి శివమోహన్‌రెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం ప్రపంచ నేల దినోత్సవం సందర్భంగా సింహాద్రిపురం కస్తూర్బా బాలికల పాఠశాలలో భూమి కలుషితం కాకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలి అనే విషయమై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నేల ఆకృతి, నేల నాణ్యత, వాటి పరిరక్షణపై ఏఓ వివరించారు. రైతులు రసాయన పురుగు మందులు తగ్గించి నేల నాణ్యత పెంచడంలో రైతుల బాధ్యత గురించి వివరించారు. సేంద్రియ వ్యవసాయం చేసి భూమిలో కర్బన శాతాన్ని పెంచేలా విద్యార్థులు మీ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని ఏఓ వివరించారు. పల్లెల్లో పశుపోషణ వల్ల వ్యవసాయానికి తగిన పేడ ఎరువుతో భూములు సారవంతం చేసకునే విదానాన్ని ఏఓ వివరించారు. సారవంతమైన కలుషితం కాని భూమిని రాబోవు తరాలకు అందించేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు. కస్తూర్బా ప్రిన్సిపాల్ గురుదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవు: ఎంపీడీఓ

చెన్నూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావు హెచ్చరించారు. శక్రరవారం చెన్నూరు బాలుర ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం ఆరగించారు. అలాగే అప్పుడే పాఠశాల సందర్శనకు వచ్చిన సీఐ పురుషోత్తంరాజు కూడా వారితో కలిసి భోజనం చేశారు. మండల వ్యాప్తంగా శనివారం జరిగే పేరెంట్స్ కమిటీ సమావేశానికి హైస్కూలు ప్రాంతాన్ని పరిశీలించి ఏర్పాట్లు ఎలా చేయాలన్న దానిపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పద్మనాభయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే సదస్సులు

రెవెన్యూ సదస్సుల్లో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ● జమ్మలమడుగు ఆర్డీఓ దృష్టికి రాజోలి సమస్య




చాపాడు సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ - పెద్దముడియం రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ సాయిశ్రీ

చాపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పార్టీలకతీతంగా పరిష్కరిస్తామని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. లక్ష్మీపేట సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ, ప్రైవేటు వ్యక్తుల భూములకు న్యాయం చేస్తామన్నారు. బాధితులు ఎవరైనా వారికి జరిగిన అన్యాయాన్ని అర్జీల రూపంలో ఇవ్వాలన్నారు. ఈ సదస్సులో మొత్తం ఆరు అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు రమాకుమారి పేర్కొన్నారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చిన్నయ్య, మండల స్పెషల్ ఆఫీసర్ విజయలక్ష్మి, టీడీపీ నేతలు గురివిరెడ్డి, వేమారెడ్డి, మునిశేఖర్‌రెడ్డి, నారపురెడ్డి, అన్నవరం సుధాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

బద్వేలులో....

బద్వేలు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గ సమన్వయ కర్త రితేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి బొజ్జా రోశన్న, తహసీల్దార్ ఉదయభాస్కరరాజు, మండల పార్టీ అధ్యక్షుడు బసిరెడ్డి రవికుమార్‌రెడ్డి, వెంకటయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజోలి సమస్య ఆర్డీఓ దృష్టికి..

పెద్దముడియం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ సాయిశ్రీ కోరారు. పెద్దముడియం రెవెన్యూ సదస్సులో ఆమె రైతు సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దారు బాలనరసింహులు, రెవెన్యూ, దేవదాయశాఖ అధికారులు, పోలీసు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పి.గోపులాపురం సదస్సులో...

ఎర్రగుంట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పి.గోపులాపురంలో రెవెన్యూ సదస్సులో పలురకాల భూ సమస్యలు అధికారుల దృష్టికి వచ్చాయి. సదస్సు లో డ్వామా పీడీ సురేష్‌రెడ్డి మాట్లాడుతూ రెవె న్యూ పరంగా ఎవరికైనా సమస్యలుంటే తెలపాల ని కోరారు. తహసీల్దార్ శోభన్‌బాబు, దేవదాయ శాఖ ఈఓ జగన్‌మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొ న్నారు. ముద్దనూరు మండలం కొసినేపల్లిలో రెవెన్యూ సదస్సును అధికారులు ప్రారంభించారు.

కొసినేపల్లిలో....

కాశినాయన డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): భూసమస్యలను పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు బద్వేలు ఆర్డీఓ చంద్రమోహన్, మండల ప్రత్యేక అధికారి జిల్లా సర్వే ఏడీ మురళీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం పాపిరెడ్డిపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

ప్రొద్దుటూరులో...

ప్రొద్దుటూరురూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు రెవెన్యూ సదస్సుల ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, పులివెందుల ఇన్‌చార్జి ఆర్డీఓ అనూరాధ పేర్కొన్నారు. కామనూరులో రెవెన్యూ సదస్సుల ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. మాజీ ఎంపీపీ నంద్యాల రాఘవరెడ్డి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

కొరపాటిపల్లెలో...

పోరుమామిళ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీనేత రితీష్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ చంద్రమోహన్ అన్నారు. లచ్చంపల్లె రెవెన్యూ విలేజ్ కొరపాటి పల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న, తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌ఐ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భారతదేశ ఔన్నత్యాన్ని చాటిన మహోన్నతుడు

పోరుమామిళ్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాతగా భారత దేశ ఔన్నత్యాన్ని ప్రజాస్వామ్య స్ఫూర్తిని విశ్వవ్యాప్తం చేసిన మహోన్నత కీర్తి శిఖరం భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ అని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి అన్నారు. పోరుమామిళ్లలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

బద్వేలులో...

బద్వేలు, డిసెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాల సాధనకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నానబాల వెంకటేశ్వర్లు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి బద్వేలు గురుమూర్తి పిచ్చయ్య, సీపీఎం ఆధ్వర్యంలో పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.

మైదుకూరులో....

మైదుకూరురూరల్,డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ నివాళులర్పించారు. టీడీపీ అధ్యక్షుడు దాసరిబాబు, ధనపాల జగన్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు యాపరాల చిన్న, ఏపీ రవీంద్ర, శ్రీనివాసులు, గుండం రాజు సుబ్బయ్య, డీలర్ సంఘం అధ్యక్షుడు చొక్కం శివ, డీలర్ బండి అమర్‌నాథ్, భూమిరెడ్డి రమణ పాల్గొన్నారు.

పీడబ్ల్యూడీ బంగ్లాలో...

దువ్వూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీడబ్ల్యూడీ బంగ్లాలో కొత్తగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. మరో కార్యక్రమంలో బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బీఆర్ అంబేడ్కర్ అని బీఎస్పీ కడప జిల్లా అధ్యక్షుడు జయరాం తెలిపారు.

కలసపాడులో....

కలసపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి ఎంపీపీ నారాయణ, హెడ్ కానిస్టేబుల్ నాగార్జున నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత నేతలు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో...

జమ్మలమడుగు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): దేశం గర్వించదగ్గ నేత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అంటూ జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ నేతలు, కార్యకర్తలతో కలిసి ఆయన నివాళులర్పించారు. వైసీపీ కార్యాలయంలో అంబేడ్కర్ పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి నివాళులర్పించారు. ఎస్సీ కాలనీలో ప్రాథమిక పాఠశాలలో అంబేడ్కర్ చిత్రపటానికి బీజేపీ మహిళా నాయకురాలు మెరుగు అరుణకుమారి నివాళులర్పించారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

విలేకరులతో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నారన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న భూ సమస్యలు రెవెన్యూ వివాదాలను పరిష్కరించడానికి ఈ సదస్సులు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, కౌన్సిలర్లు జిలానీబాష, మహమ్మద్‌గౌస్, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ చౌడం వెంకటకొండయ్య, పగిడాల దస్తగిరి పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలు : ఎమ్మెల్యే పుట్టా

దువ్వూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పథకాలు వర్తిస్తాయని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. వృద్ధాప్య, వైదవ్య, మూగ, అవిటివారందరికీ పింఛన్లు ఇస్తామని ఎమ్మెల్యే తెలిపారు. గృహ నిర్మాణాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పార్టీలకతీతంగా పథకాలు పొందవచ్చని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో పేదల భూములు లాక్కున్నారని, అనర్హులు పింఛన్లు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు శ్రమించిన ఆశీర్వాదం, తహసీల్దారు అక్బర్‌బాష, ఎంపీడీఓ రామకృష్ణయ్య, టీడీపీ కన్వీనర్ పోరెడ్డి వెంకటరమణారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శికి నోటీసు జారీ

చాపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీపేట సచివాలయ కార్యదర్శి వెంకటనాయుడుకు శుక్రవారం నోటీసు జారీ చేసినట్లు ఎంపీడీఓ వీరకిశోర్ తెలిపారు. కేతవరంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పాల్గొన్నారు. కార్యదర్శి వెంకటనాయుడుతో మాట్లాడి ప్రజలు చెప్పిన సమస్యలను పరిష్కరించేందుకు అందుబాటులో లేడని ఎమ్మెల్యే ఫిర్యాదు చేశాడన్నారు. విధులకు రానందున సంజాయిషీ కోరుతూ ఆయనకు నోటీసు జారీ చేసినట్లు ఎంపీడీఓ పేర్కొన్నారు.

మున్సిపల్ సర్వేయర్‌గా నాగరాజు

ప్రొద్దుటూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపల్ సర్వేయర్‌గా ఎర్రగుంట్ల మున్సిపల్ సర్వేయర్ నాగరాజును ఇన్‌చార్జ్‌గా నియమించారు. మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను కలిసిన నాగరాజు జాయినింగ్ రిపోర్టు అందజేశారు. గతంలో ఇక్కడ పనిచేసిన సర్వేయర్ రవి కిషోర్ నకిలీ చలానాలు సృష్టించి మున్సిపల్ ఆదాయానికి గండి కొట్టడంతో అతన్ని మాతృసంస్థకు అప్పగించారు. దీంతో కమిషనర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ముంబైకి జైనుల పాదయాత్ర

కొండాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చెన్నై నుంచి ముంబైకు ముగ్గురు జైనులు పాదయాత్ర చేపట్టారు. జైన్ శాంట్, యూవచార్యశ్రీ, మహేంద్ర రుషిజీ జైనులు చెన్నై నుంచి ముంబైకి పాదయాత్రగా వెళుతున్నారు. విడిదిలో భాగంగా గురువారం సాయింత్రం వివేకానంద పాఠశాలలో సేద తీరారు. అనంతరం శుక్రవారం తెల్లవారుజాము నుంచే పాదయాత్రగా వెళ్లారు. పది రోజుల కిందట చెన్నైలో పాదయాత్ర ప్రారంభించామని, మూడు నెలలు సుమారు 1300 కిలోమీటర్లు పాదయాత్ర కొనసాగుతుందని వారు తెలిపారు.

అయ్యప్పస్వాములకు భిక్ష

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి మాలధారులకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్ భిక్ష ఏర్పాటు చేశారు. శుక్రవారం ఆయన నివాసంలో వంద మంది స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. కఠినమైన నియమ నిబంధనలతో అయ్యప్పస్వాములు దీక్ష వహిస్తారన్నారు. ఒకరి మతాన్ని మరొకరు గౌరవించుకుంటూ సామరస్యంగా జీవించాలన్నారు. భిక్ష ఆరగించిన అయ్యప్పస్వాములు వీఎస్ ముక్తియార్ కుటుంబాన్ని దీవించారు.

మంత్రిని కలిసిన కనుమల్లపూడి ప్రసాద్



బద్వేలుటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖా మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి కనుమల్లపూడి ప్రసాద్ కలివారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిసి మర్యాదపూర్వకంగా సత్కరించారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

కలసపాడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీఓ మహబూబ్‌బీ, ఎంపీపీ బోధన బోయిన నిర్మలాదేవి తెలిపారు. గ్రామాల్లో పారిశుధ్య చర్యల్లో భాగంగా బ్లీచింగ్ పౌడరు చల్లడం, మురుగునీటి కాల్వలు శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. హౌసింగ్ పెండింగు బిల్లును సమీక్ష జరపాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సమస్యలపై సదస్సులు నిర్వహిస్తున్నారని వాటిపై కూడా అధికారులంతా పనిచేయాల్సిన బాధ్యత ఉందన్నారు. తాగు నీటి ఎద్దడి లేకుండా చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు మధురవాణి, పంచాయతీ అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పెన్షనర్ల సంక్షేమానికి కృషి చేస్తాం

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సంక్షేమానికి కృషి చేస్తామని ప్రొద్దుటూరు తాలూకా లెక్చరర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.దస్తగిరిరెడ్డి, కార్యదర్శి ఆర్.వెంకటరమణయ్యయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం లెక్చరర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జిల్లా లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దస్తగిరిరెడ్డి, కార్యదర్శి ఆర్.వెంటయ్యయాదవ్, మరికొందరిని ఎన్నుకున్నారు.

వందశాతం రాయితీతో పశుగ్రాసం

ముద్దనూరు డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం పెంపకంపై రైతులకు వందశాతం రాయితీ ప్రభుత్వం అందిస్తున్నట్లు ఇన్‌చార్జి ముద్దనూరు ఏడీఏ శ్రీనివాస తెలిపారు. బహు వార్షిక పశుగ్రాసాల సాగు కింద పాడి రైతులు, గొర్రెల పెంపకం దారులకు రాయితీ ఇస్తుందన్నారు.10 నుంచి 50 సెంట్ల భూమిలో పశుగ్రాసం పెంచుకోవచ్చన్నారు. 5 ఎకరాలున్న ఎస్సీ, ఎస్టీ, చిన్న, సన్నకారు రైతులు అర్హులని, రైతు సేవాకేంద్రాల్లో సంప్రదించాలన్నారు.

అనారోగ్యంతో టీడీపీ నేత మృతి

బి.కోడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజుపాలెం టీడీపీ నేత మున్నెల్లి కేశవ గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఈయన కిడ్నీ సంబంధిత వ్యాధితో ఆరోగ్యం క్షీణించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు, భార్య ఉన్నారు. మృతుడు కేశవ పెద్దకుమారుడు గురయ్య మున్నెల్లి పంచాయతీ సర్పంచ్‌గా ఉన్నారు. కేశవ మృతి విషయం తెలుసుకున్న రితీష్‌రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర రైతు విభాగం అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షుడు ఎస్.జహంగీర్‌బాషా, నారాయణరెడ్డి, దుగ్గిరెడ్డి, పవన్, నరసింహులు, పెద్దన్న పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందేలా చేస్తాం

మైదుకూరు రూరల్,డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందేలా చూస్తామని యాపరాల చిన్న అన్నారు. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులుగా యాపరాల చిన్న, మోపూరి వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం డాక్టర్లు, కొరత ఉన్న మందుల వివరాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.

పారుతున్న చెరువు అలుగు

వరినార్లు మునిగిపోతున్నాయని ఆందోళనలో రైతులు


అమ్మవారిపేట చెరువు అలుగు ఉధృతంగా పారుతున్న దృశ్యం

బి.కోడూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అమ్మవారిపేట చెరువు అలుగు మూడు రోజులుగా ఉధృతంగా పారుతోంది. దీంతో వరినార్లు మునిగిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. అమ్మవారిపేట చెరువు కింద పొలాలకు దాదాపు 400 ప్యాకెట్లు విత్తనాల వడ్లు తెచ్చి రైతులు వరినారు పోసుకున్నారు. అయితే చెరువు అలుగు ఉధృతంగా పారుతూ పొలాల మీద గుంతపల్లె చెరువుకు వెళుతున్నాయని వరినారు దొడ్లన్నీ నీట మునిగి ఉన్నాయని దీంతో చాలా నష్టం జరుగుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ విషయంపై ఇరిగేషన్ డీఈ వేణు గోపాలరెడ్డిని అడగ్గా అలుగుకు ఇసుక మూటలు వేయిస్తామని తెలిపారు. అంతేకాక అమ్మవారిపేట చెరువు నుంచి బద్వేలు పెద్దచెరువుకు వెళ్లే కాల్వకు పూర్తిగా నీళ్లను ఎత్తివేశామని ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుకు ఎక్కువగా నీరు చేరడంతో అలుగు పారుతోందని వీలైనంత త్వరగా ఇసుక మూటలు వేయిస్తామని తెలిపారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి


మాట్లాడుతున్న కెనరాబ్యాంక్ ఆర్‌ఎం

ప్రొద్దుటూరు టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కెనరా బ్యాంకు రీజినల్ మేనేజర్ కె.మురళీమోహన్ పేర్కొన్నారు. శుక్రవారం ఎస్‌కేగ్రాండ్‌లో ఎంఎస్ఎంఈ క్లస్టర్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక వేత్తల కోసం కెనరా బ్యాంకులో ఆకర్షణీయమైన స్కీంలు ఉన్నాయని, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు వాటిని సద్వినియోగం చేసుకుని పురోగతి సాధించాలన్నారు. బ్యాంకు ద్వారా లభించే సేవలు, రుణ సౌకర్యాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. సీనియర్ మేనేజర్ ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ మహిళలకోసం మహిళా వికాస్ పథకం అమలు చేస్తున్నామని, బిజినెస్ లోన్స్, విద్య, వ్యక్తిగత, వ్యవసాయ రంగాలకు అందజేస్తామన్నారు. ఎటువంటి సెక్యూరిటీ లేకుండా రూ.10 లక్షల వరకు ముద్ర రుణాలను తమ బ్యాంకు అందజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కెనరా బ్యాంకు మెయిన్, గాంధీ రోడ్డు, జిన్నారోడ్డు, ముద్దనూరు, జమ్మలమడుగు, చిలమకూరు బ్యాంకుల మేనేజర్లు, వ్యాపారులు యువకులు, ఖాతాదారులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ కమిషనర్‌కు సమస్యలపై వినతి


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కొనిరెడ్డి శివచంద్రారెడ్డి

ప్రొద్దుటూరు రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లె పంచాయతీ సమస్యలపై పంచాయతీరాజ్ కమిషనర్ క్రిష్ణతేజకు సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి వినతి పత్రం అందజేశారు. శుక్రవారం సెక్రటరియేట్‌లో కమిషనర్‌ను కలిసి ఇక్కడి సమస్యలపై విన్నవించారు. మేజర్ పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని ప్రగతిపథంలో పంచాయతీ పరుగులు పెట్టేలా నిధులు మంజూరు చేయాలని కోరారు.

దాడులకు యత్నించిన వారిని అరెస్టు చేయాలి

- అయ్యప్పస్వాముల ఆందోళన
- రెండు గంటల పాటు ఉద్రిక్తత
- ఇరువైపులా మోహరించిన ఇరువర్గాలు
- ఆందోళనకారులతో మాట్లాడిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డి
- ఎట్టకేలకు సర్దుబాటు.. ఊపిరి పీల్చుకున్న జనం


ఆందోళన చేస్తున్న అయ్యప్పస్వాములను అడ్డుకుంటున్న పోలీసులు

రాయచోటి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వాముల గ్రామోత్సవం సందర్భంగా గురువారం రాత్రి పట్టణంలో జరిగిన వివాదం నేపథ్యంలో.. శుక్రవారం ఉదయం పట్టణంలో అయ్యప్పస్వాములు ఆందోళనకు దిగారు. శాంతియుతంగా గ్రామోత్సవం చేస్తున్న తమను అడ్డుకుని.. దాడి చేయడానికి యత్నించిన వారిపై కేసులు నమోదు చేసి.. అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ.. పెద్దఎత్తున అయ్యప్పస్వాములు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఎస్ఎన్ కాలనీలోని శివనంది సర్కిల్ నుంచి నేతాజి సర్కిల్ వరకు ఈ ర్యాలీ కొనసాగింది. అయితే గురువారం రాత్రి ఠాణా సర్కిల్‌లో ఓ వర్గం ప్రజలు పెద్ద ఎత్తున గుమికూడి ఆందోళనకు దిగడంతో.. ఉద్రిక్తతలు నెలకొన్న నేపథ్యంలో..పోలీసులు ఈ ర్యాలీని అడ్డుకునే ప్రయత్నం చేశారు. వందల సంఖ్యలో అయ్యప్పస్వాములు ఉండడంతో పోలీసులు వారిని నిలువరించలేకపోయారు. పరిస్థితి అదుపు తప్పుతుందనే అనుమానంతో వందలాది మంది పోలీసులను ఉన్నతాధికారులు రప్పించారు. రాజధాని హోటల్ ఎదురుగా రోడ్డుపైన ఆందోళన చేస్తున్న అయ్యప్పస్వాములను పోలీసులు అడ్డుకున్నా వారిని తోసుకుని నేతాజీసర్కిల్‌కు చేరుకుని అక్కడ రోడ్డుపైన బైఠాయించి ఆందోళన చేశారు. రాత్రి తమను అడ్డుకున్న ప్రాంతంలోకి ఇప్పుడు వెళ్తామని అయ్యప్పస్వాములు పట్టుబట్టారు. రాయచోటి అడిషనల్ ఎస్పీ వెంకటాద్రి, డీఎస్పీ కృష్ణమోహన్, అర్బన్ సీఐ చంద్రశేఖర్ తదితరులు ఆందోళనకారులకు నచ్చజెప్పేందుకు యత్నించినా వారు ఆందోళనను కొనసాగించారు. ఇదే సమయంలో అటువైపు మరో వర్గానికి చెందిన వాళ్లు కూడా పెద్ద సంఖ్యలో గుమికూడి నినాదాలు చేశారు. దీంతో ఒకసారిగా ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇరువర్గాలు పోలీసుల మాట వినకపోవడంతో.. గొడవ పెద్దదవుతుందేమోనని అందరూ ఆందోళన చెందారు. ఈ సమయంలో ఆందోళనకారుల వద్దకు మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి వచ్చి సర్దిచెప్పారు. రాయచోటి పట్టణంలో హిందూ, ముస్లింలు సోదరభావంతో జీవించాలని ఆయన కోరారు.

రాయచోటి ప్రజల ప్రశాంత జీవనాన్ని దృష్టిలో పెట్టుకుని ఆందోళన విరమించాలని సూచించడంతో ఎట్టకేలకు ఆందోళనకారులు ఆందోళన విరమించారు. మరోవైపు గుమికూడిన ఇంకో వర్గం ప్రజలను అదే వర్గానికి చెందిన పలువురు పెద్దమనుషులు, యువకులు శాంతింప చేసి అక్కడి నుంచి పంపించేశారు. దీంతో సుమారు రెండు గంటల పాటు సాగిన ఆందోళన సద్దుమణిగింది. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు స్వయంగా బందోబస్తును పర్యవేక్షించారు. శుక్రవారం రాత్రి ఠాణా సర్కిల్‌లో పర్యటించి.. పోలీసు ఉన్నతాధికారులకు పలు సూచనలు ఇచ్చారు. పెద్ద సంఖ్యలో సీఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బందిని రాయచోటికి తరలించారు. సున్నితమైన ప్రాంతాలలో పోలీసులను మోహరించారు. రాయచోటి పట్టణాన్ని పోలీసులు తమ గుప్పిట్లోకి తీసుకున్నారు.

వైవీయూలో విభాగాల అధిపతుల నియామకం

కడప ఎర్రముక్కపల్లె డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైవీయూలో పలు విభాగాల అధిపతులను నియమిస్తూ రిజిస్ట్రారు ప్రొఫెసరు పుత్తా పద్మ ఉత్తర్వులు జారీ చేశారు. 2026 డిసెంబరు 4 వరకు విధుల్లో కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. గతంలో పనిచేసిన వారి పదవీ కాలం పూర్తి కావడంతో నూతన నియామకాలు చేపట్టామన్నారు. డాక్టర్ లక్ష్మీప్రసాద్ (ఎర్త్‌సైన్స్), డాక్టర్ రామక్రిష్ణ బయోటెక్నాలజీ అండ్ బయోఇన్‌ఫర్‌మేటిక్, డాక్టర్ చంద్రశేఖర్ పర్యావరణ శాస్త్రం, డాక్టర్ మునికుమారి జెనెటిక్ అండ్ జనోమిక్, డాక్టర్ ఎన్.సుభాష్ చంద్ర మైక్రోబయాలజీ, డాక్టర్ లాజర్ మనస్తత్వ శాస్త్రం, డాక్టర్ ప్రమీలా మార్గరేట్ పొలిటికల్ సైన్స్‌అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ప్రొఫెసరు ఎంఎం వినోదిని తెలుగు, ప్రొఫెసరు శ్రీనివాసులు ఆర్థికశాస్త్రం, డాక్టర్ ఎస్వీ వెంకటరమణ జంతు శాస్త్రం, డాక్టర్ సునీత భూగర్భశాస్త్రం, డాక్టర్ సి.సరిత బిజినెస్ మేనేజ్‌మెంటు, కె.మృత్యుంజయరావు ఫైన్‌ఆర్ట్స్, డాక్టర్ టి.శ్యాంస్వరూప్ జర్నలిజం అండ్ కమ్యూనికేషన్, డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి ఫిజికల్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ సైన్సెస్‌గా నియమితులయ్యారు.

ఉద్యాన సమగ్ర పథకానికి రూ.18.13 కోట్లు మంజూరు

కడప ఎన్టీఆర్ సర్కిల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు ఉద్యాన సమగ్ర పథకం కింద రూ.18.13 కోట్లు మంజూరైనట్లు జిల్లా ఉద్యాన అధికారి ఎస్.సుభాషిణి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో ఇంటిగ్రేటెడ్ ప్యాక్ హౌస్, శీతల గిడ్డంగులు, శీతల గదులు, రెపనింగ్ ఛాంబరు, ఉల్లి నిల్వ గోదాములు, కలెక్షన్ సెంటరులు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఆసక్తి ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరింత సమాచారానికి మండలాల్లోని ఉద్యానశాఖ అధికారులను, కలెక్టరేట్‌లోని ఓ బ్లాక్‌లో ఉన్న తమ కార్యాలయంలో కూడా సంప్రదించవచ్చని తెలిపారు.

విద్యుత్ సమస్యలపై ఏకరువు

- ప్రత్యేక విద్యుత్తు అదాలత్ చైర్‌పర్సన్ ఎదుట ఆవేదన


వినియోగదారుల సమస్యలు తెలుసుకుంటున్న శ్రీనివాస ఆంజనేయమూర్తి

జమ్మలమడుగు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు విద్యుత్తు సబ్ డివిజన్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ప్రత్యేక విద్యుత్తు అదాలత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రత్యేక విద్యుత్తు అదాలత్ చైర్‌పర్సన్ శ్రీనివాస ఆంజనేయమూర్తి మాట్లాడుతూ జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. సమస్యలున్నవారు నేరుగా చెప్పడం లేదా రాతపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని వినియోగదారులకు సూచించారు. ఈ మేరకు జమ్మలమడుగు పట్టణంలోని ఓ ఇంటి యజమాని గత 13 సంవత్సరాలుగా తన ఇంటికి సంబంధించి పెండింగ్ కరెంటు బిల్లు రూ.1.35 లక్షలు ఉందని... తగ్గిస్తే బిల్లు కడుతానని తెలిపారు. ఇందుకు చైర్‌పర్సన్‌తో పాటు కమిటీ సభ్యులు బిల్లులను తగ్గించేది లేదని, వాయిదాల పద్ధతిలో కట్టవచ్చని చెప్పారు. అలాగే జమ్మలమడుగు, ప్రొద్దుటూరు, ఎర్రగుంట్ల పరిధిలోని పలువురు తమ తమ సమస్యలను నేరుగా చెప్పారు. మరికొందరు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. జమ్మలమడుగు పట్టణంలోని మున్సిపాలిటీకి సంబంధించి వాటర్‌ప్లాంట్లకు సుమారు కోటి రూపాయల వరకు బకాయిలు ఉంటాయని.. ఇంతవరకు వారిని ఎవరు అడగడం లేదన్నారు. కేవలం చిన్న చిన్న ఇబ్బందులతో బిల్లులు కట్టలేని పేద ప్రజలకు మాత్రమే బిల్లులు కట్టాలని ఒత్తిడి చేయడం దారుణమన్నారు. ఆర్థిక సభ్యుడు రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యుడు అంజనీకుమార్, డీఈ రాజగోపాల్, ఏఈలు, కిందిస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

520 బియ్యం బస్తాల లారీ పట్టివేత



మైదుకూరు రూరల్, డిసెంబ రు 6 (ఆంధ్రజ్యోతి): అక్ర మంగా రవాణా చేస్తున్న బియ్యం లారీని మైదుకూ రులోని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసు కున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి శివ శంకర్ సమాచారం మేరకు.. జమ్మలమడుగు నుంచి చెన్న య్‌కి వెళుతున్న బియ్యం లారీని మైదుకూరులో పోలీ సులు అదుపులోకి తీసుకొని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అటాచ్ చేశారు. లారీలో 520 బస్తాల బియ్యం ఉండగా.. వీటి విలువ సుమారు రూ.10లక్షల 79 వేలు ఉంటుందని తెలిపారు. సీజ్ చేసిన బియ్యం బస్తాలను గోడౌన్‌కు తరలించినట్లు శివశంకర్ తెలిపారు.

చికిత్స పొందుతూ 108 వాహన పైలెట్ మృతి

రామాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన 108 వాహనం పైలెట్ సంగటి రమేశ్‌బాబు (35) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. ఆయన వివరాల మేరకు.. వైఎస్ఆర్ జిల్లా బ్రహ్మంగారిమఠం మండలం కందిమల్లయపల్లె రవీంద్రనగర్ వాసి రమేశ్‌బాబు మొలకలచెరువులో 108 వాహనం పైలెట్‌గా పనిచేస్తున్నాడు. కడపలో 108 వాహనం మరమ్మత్తులు చేయించుకుని తిరిగి మొలకలచెరువుకు వస్తుండగా గురువారం రాత్రి గువ్వల చెరువు ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని కడప రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇరువురి మధ్య ఘర్షణ- ఒకరిమృతి


రామాంజనేయులు మృతదేహం

చక్రాయపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండికొవ్వూరు గ్రామం దళితవాడలో శుక్రవారం సాయంత్రం మురుగునీరు వస్తున్నాయని ఘర్షణకు దిగడంతో దండు రామాంజనేయులు (36) మృతిచెందాడు. దండు రామాంజనేయులు భార్య శివలక్ష్మి ఫిర్యాదు మేరకు చక్రాయపేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకెళితే.. బట్టలు ఉతికేనీళ్లు ఇంటి ముందు పోతున్నాయని నాగార్జున, రామాంజనేయులు గొడవకు దిగారు. దీంతో రామాంజనేయులు నాగార్జున చెల్లెలను కొట్టడంతో నాగార్జున కోపంతో రామాంజనేయులును కట్టెతో కొట్టడంతో మృతిచెందినట్లు తెలిపారు. నాగార్జున పరారీలో ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం వేంపల్లె ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

అట్లూరులో పట్టపగలే ఇంటిలో చోరీ

- రూ.2లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు అపహరణ

అట్లూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అట్లూరు క్రాస్‌రోడ్డు సమీపంలో ఉన్న ఎగువపల్లి కాలనీకి చెందిన లక్షుమ్మ ఇంటిలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. పట్టపగలే ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాలో ఉన్న సుమారు రూ.2లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. ఎస్ఐ రామక్రిష్ణ వివరాల మేరకు... బాధితురాలు లక్షుమ్మ, కుమారుడు కొండయ్య ఉదయం 11గంటల సమయంలో బద్వేలుకు వెళ్లి తిరిగి 2గంటల సమయానికి ఇంటికి చేరుకున్నారు. ఇంటి తలుపులు పగలగొట్టి ఉండడం గమనించి.. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలను చోరీ చేసినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో బద్వేలు సీఐ నాగభూషణ్, గోపవరం ఎస్ఐ శ్రీకాంత్ సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. చుట్టుపక్కల వారిని విచారించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నాగభూషణం తెలిపారు.

జీవో 145కు రద్దు చేయండి

- కోర్టు ఎదుట న్యాయవాదుల నిరసన


విధులు బహిష్కరించి కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాయచోటిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టులో ఎన్‌డీపీఎస్ యాక్టు ప్రకారం జరగాల్సిన క్రిమినల్ కేసులు ఇక్కడ జరిగే అవకాశం లేకుండా తీసుకొచ్చిన జీవో 145ను వెంటనే రద్దు చే యాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. శుక్రవారం న్యాయవా దులు విధులు బహిష్కరించి రాయచోటి కోర్టు ఎదుట నిరసన తెలియచేశారు. ఈ సందర్భంగా రాయచోటి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రెడ్డెయ్య, ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు మా ట్లాడుతూ జీవో 145 వలన రాష్ట్రంలోని 26 జిల్లాల్లో కూడా భవిష్యత్తులో ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం నమోదయ్యే కేసులు ఆయా జిల్లా కేంద్రాల్లో జరిగే అవకాశం లేకుండా పోతుందన్నారు. రాయలసీమ జిల్లాల మొత్తానికి తిరుపతి కేంద్రంగా ఒకే ఒక కోర్టు ఉం టుందని, కోస్తా ప్రాంతంలో నాలుగు కోర్టులు మాత్రమే పనిచేస్తాయని, దీనివలన కక్షిదారులు సుదూర ప్రాంతాలకు ప్రయాణం చేయాల్సి వస్తుందని వారికి ఆర్థికంగా భారమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ముంగిట్లోకి న్యాయం చేరేలా న్యాయవ్యవస్థ అభివృద్ధి కావాలని దేశ అత్యున్నత న్యాయస్థానం చెబుతు న్నప్పటికీ ప్రభుత్వాలు అందుకు విరుద్ధంగా జీవో 145 తెచ్చి ప్రజలకు న్యాయవ్యవస్థను దూరం చేస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సహాయ కార్యదర్శి నాగముని, భార త న్యాయవాదుల సంఘం కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్షుడు టి.ఈశ్వర్, న్యాయవాదులు శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్‌కుమార్, రాజమనోహర్, ధనుంజయకుమార్, రామాంజులు, రవిశంకర్, తాహీర్, నాగమల్లు, వీరభద్రయ్య, కుసుమ, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు ఎజాజ్ మృతి బాధాకరం : మంత్రి


మంత్రి నారాలోకేశ్‌తో ఫోనులో మాట్లాడుతున్న ఆజాజ్ అహ్మద్ కుటుంబ సభ్యులు

కడప ఎడ్యుకేషన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాయచోటి ఉర్దూ పాఠశాల ఉపాధ్యాయుడు ఎజాజ్ ఆకస్మిక మృతి బాధాకరమని, ఉపాధ్యాయ లోకాన్ని తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేస్తుందని రాష్ట్రరవాణా క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం కడప నగరంలోని మృతుడు నివాసంలో ఎజాజ్ కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించి ..కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆకతాయి చేష్టలు విద్యాబుద్ధులు నేర్పే ఉపాధ్యాయుడి ప్రాణాలు కోల్పోవడానికి కారణం కావడం బాధాకరమన్నారు. ఈసంఘటనపై సీఎం సీరియస్‌గా ఉన్నారన్నారు. ఎజాజ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉందని, అతని మృతికి గల కారణాలపై సమగ్రంగా విచారణ చేపట్టి తెలుసుకుంటామన్నారు. ఒక మంచి ఉపాధ్యాయుని కోల్పోయిందని, ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని.. వారి కుటుంబ సభ్యులకు ఓదార్పును, తమ ప్రగాఢ సానుభూతి తెలుపుకుంటున్నామని అన్నారు. ఈసందర్భంగా విద్యాశాఖమంత్రి నారాలోకేశ్ ఫోను చేసి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి అధైర్య పడవద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పారు.

ఎస్టీయూ వినతి : ఎజాజ్ అహ్మద్ కుటుంబానికి న్యాయం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్‌బాషా రాష్ట్ర నాయకులు బాలగంగారెడ్డి కోరారు. శుక్రవారం మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ఎస్టీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఎస్టీయూ నాయకులు సాదిక్‌ఆలీ, సంజీవరాయుడు, జబీబుల్లా ఖాన్, ఫకృద్దీన్, ఖాజామొయినుద్దీన్, ఫయాజ్ పాల్గొన్నారు.

స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు రోల్ మోడల్‌గా ఉండాలి


శిక్షణ కార్యక్రమానికి హాజరైన స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు

రాయచోటిటౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించి రోల్ మోడల్‌గా నిలవాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సూచించారు. శుక్రవారం గాలివీడు రోడ్డులోని అర్చనా కళాశాలలో స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్ల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించడం ద్వారా ప్రపంచ స్థాయి పౌరులుగా తీర్చిదిద్దేందుకు స్కౌట్ అండ్ గైడ్స్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. స్కౌట్‌లో చేరడం ద్వారా విద్యార్థి దశ నుంచే తల్లిదండ్రులు, గురువులతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ సమాజంపై బాధ్యతగా వ్యవహరించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు సమకూరుతుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు, ఆన్ ఎయిడెడ్ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను తప్పనిసరిగా ఏర్పాటు చేసేందుకు సంబంధిత ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు. అన్నమయ్య జిల్లాలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా ప్రధాన కార్యాలయం ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని సమకూర్చేందుకు, భవన నిర్మాణానికి కృషి చేయాలని స్కౌట్ అధికారులు మంత్రికి విన్నవించారు. కార్యక్రమంలో అర్చనా విద్యాసంస్థల కరస్పాండెంట్ పాపిరెడ్డి మదన్‌మోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మౌలాలి, జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి, జిల్లా ట్రెజరర్ మార్ల ఓబుల్‌రెడ్డి, స్కౌట్ అధికారులు, వివిధ మండలాల నుంచి శిక్షణకు వచ్చిన స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు తదితరులు పాల్గొన్నారు.

లింగాలలో హైనా కలకలం


ప్రజలతో మాట్లాడుతున్న శ్రీనివాసులు

లింగాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): లింగాలలో శుక్రవారం ఉదయం హైనా కలకలం రేగింది. గ్రామానికి చెందిన బయన్న ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఉదయం ఇంటి నుంచి బయటకు రాగానే ఎదురుగా ఉన్న హైనా పరుగులు తీసింది. పులిపిల్లగా భావించి అందరికి పులిపిల్లను చూశానని తెలిపాడు. సమాచారం అందుకున్న ముద్దనూరు అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు సంఘటన స్థలంలోని పాదముద్రలు పరిశీలించి హైనాగా గుర్తించారు. ఆయన మాట్లాడుతూ హైనా కుక్క జాతికి చెందినమాంసాహార జంతువు అని తెలిపారు. దీంతో మనుషులకు ఎలాంటి ప్రమాదం లేదన్నారు. చిన్న పిల్లల పట్ల కాస్త అప్రమత్తగా ఉండాలని సూచించారు. కర్ణపాపాయపల్లెలో కూడా గురువారం పొలంలో కనిపించిన జంతువు హైనాగా గుర్తించారు.

పోలీసుల అదుపులో పాల వ్యాపారి....?

కడప(క్రైం)డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కడప నగరం పాత కడపకు చెందిన పాల వ్యాపారిని రిమ్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. రామంజనేయపురానికి చెందిన మహిళకు, అలాగే కాగితాలపెంట ప్రాంతానికి చెందిన మరో మహిళకు పాలు పోస్తుంటాడు. ఒక మహిళకు తెలియకుండా మరో మహిళకు వారి ఫొటోలు వాట్సాప్ ద్వారా పంపించాడు. రామాంజనేయపురానికి చెందిన మహిళ ఫొటోలు తీస్తుండగా.. ఆమె తన ఫొటోలు ఎందుకు తీస్తున్నావంటూ పాలవ్యాపారిని నిలదీసినట్లు సమాచారం. ఆమె సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాల వ్యాపారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

అప్పు చెల్లించలేదని.. వ్యక్తిని కిడ్నాప్ చేసిన వ్యాపారి

కడప(క్రైం), డిసెంబరు 6: కడప నగరం ఎన్జీవో కాలనీకి చెందిన ఓ వ్యక్తి వేంపల్లెకు చెందిన వ్యాపారి వద్ద లక్షల్లో అప్పు తీసుకున్నట్లు తెలిసింది. ఈ అప్పు చెల్లించ కపోవడంతో శుక్రవారం ఆ వ్యాపారి కడపలోని అప్పు తీసుకున్న వ్యక్తి ఇంటికి రాత్రి వచ్చి కారులో బలవంతంగా తీసుకెళ్లినట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా ఈ విషయంపై చిన్నచౌకు పోలీసులను వివరణ అడుగగా... ఈ విషయం తమ దృష్టికి రాలేదని, ఇప్పటివరకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

పోలీసుశాఖలో హోంగార్డుల సేవలు కీలకం


హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో హోంగార్డ్స్ సేవలు కీలకంగా మారాయని అదనపు ఎస్పీ వెంకటాద్రి తెలిపారు. హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా అన్నమయ్య జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలో 322 మంది హోంగార్డులు విధులు నిర్వర్తిస్తుండగా అందులో పురుషులు 303 మంది, మహిళలు 19 మంది ఉన్నారని, పోలీసుశాఖకు వారు అందిస్తున్న సేవలను కొనియాడారు. పోలీసులతో సమానంగా హోంగార్డులు సేవలు అందిస్తుండటం అభినందనీయమన్నారు. హోంగార్డు వ్యవస్థ పోలీసుశాఖలో కీలకంగా మారిందని, ఎన్నో సంవత్సరాల నుంచి టెక్నికల్, సీసీటీఎస్ఎస్, కోర్టు డ్యూటీలు, కంప్యూటర్ విధులు, అన్ని బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారన్నారు. సాధారణ డ్యూటీల మొదలు క్లిష్టతరమైన విధుల్లో చక్కగా పని చేస్తున్నారని, పోలీసులతో సమానంగా క్రైమ్, కంప్యూటర్ వర్క్, టెక్నికల్, కోర్టు, వృత్తి నైపుణ్యం ప్రదర్శిస్తున్నారన్నారు. అవినీతి, అక్రమాలకు దూరంగా ఉండాలని, పారదర్శకంగా, నిజాయితీగా పని చేయాలని, నిత్యం శిక్షణతో మెలుగుతూ పోలీసు ప్రతిష్ఠను పెంచేలా విధులు నిర్వర్తించాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ, ఏవో కృష్ణుడు, ఎస్బీ సీఐ సత్యనారాయణ, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వీజే రామకృష్ణ, జాన్‌జోస, పెద్దయ్య, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, హోంగార్డులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.